క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ రైతు ధర్నా

మహేశ్వరం: మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణ మాఫీ పేరుతో మోసం చేసిందని ఆరోపిస్తూ రైతు మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతారని పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రుణమాఫీ.. మోసం..

తుక్కుగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేసిందని నిరసనగా బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహేశ్వరం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ఆ పార్టీ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య తెలిపారు.

రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా మహేందర్



ఊటు మహేందర్‌ను సన్మానిస్తున్న బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్

కందుకూరు: బీజేవైఎం రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా మండల పరిధిలోని ముచ్చర్లకు చెందిన ఊటు మహేందర్ నియమితులయ్యారు. బుధవారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఊటు మహేందర్ మాట్లాడుతూ కళాశాల స్థాయి నుంచే ఏబీవీపీతో పాటు బీజేపీలో పలు బాధ్యతలు నిర్వహించి ఎన్నో ఉద్యమాల్లో పాలు పంచుకున్నానన్నారు. తనకు బీజేవైఎం రాష్ట్ర స్థాయిలో పదవి అప్పగించినందుకు అధ్యక్షుడు మహేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కరాటే పోటీల్లో కార్తీక్ గౌడ్ ప్రతిభ

గోల్డ్ మెడల్ కైవసం

మహేశ్వరం: షాద్‌నగర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల పరిధిలోని మన్సాన్‌పల్లికి చెందిన పి.కార్తీక్ గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. మాస్టర్ మల్లేశ్ యాదవ్ జ్ఞాపకార్థంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వైష్ణవి టెక్నో స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థి గోల్డ్‌మెడల్ సాధించడం గర్వకారణమని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ.1.5లక్షల ఎల్ఓసీ అందజేత

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎంపీపటేల్‌గూడకు చెందిన కొత్త వెంకటేశ్ గౌడ్.. వైద్య ఖర్చుల కోసం చైర్మన్ మర్రిని సంప్రదించగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో బుధవారం ఆయన బాధితుడికి రూ.1.5 లక్షల ఎల్ఓసీని అందజేశారు. అనంతరం మాట్లాడారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా తనను సంప్రదించాలని మర్రి సూచించారు.

మేడికుంటకు తాత్కాలిక మరమ్మతులు

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం మేడికుంట చెరువుకు గండి పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నీరు వృథాగా పోకుండా బుధవారం అధికారులు జేసీబీ సహాయంతో మట్టిని పోయించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. చెరువు మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా రాఘవేందర్

ఆమనగల్లు: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఎర్రోళ్ల రాఘవేందర్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాఘవేందర్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల మాట్లాడుతూ.. తనను నియమించిన ఆర్.కృష్ణయ్య, సహకరించిన కృష్ణ, నందగోపాల్, ఉదయ్‌కుమార్, నీలం వెంకటేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



పోచమ్మకుంట చెరువు సమీపంలో నిర్మాణాలు



కోమటికుంట చెరువును ఆక్రమించి నిర్మిస్తున్న ఇల్లు

యథేచ్ఛగా కబ్జాలు..!

- అన్యాక్రాంతమవుతున్న చెరువులు, కుంటలు
- స్థానిక నాయకుల అండతోనే సాగుతున్న దందా
- శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఎక్కువ
- పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలోని చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాలకు గురై కుచించుకుపోతున్నాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని పోచమ్మకుంట, ఎర్రకుంట, కోమటికుంట చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. బాలాపూర్‌లోని పెద్ద చెరువు తూం కూడా కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ విషయంలో స్థానిక నాయకుల అండదండలతోనే ఈ తంతు యథేచ్ఛగా సాగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీర్‌పేట, బడంగ్‌పేట మధ్యలోని పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏకంగా పెద్ద షెడ్లు వేసి ఇండోర్ టెన్నిస్ కోర్టు, వ్యాపార సముదాయాలు, పెట్రోల్ బంకు నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డుకోవలసిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. చెరువులు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. బడంగ్‌పేట గ్రామ పరిధిలోని చెరువులు కుంటలు ఆన్‌లైన్లో ఇరిగేషన్, మరియు హెచ్ఎండీఏ పరిధిలోని సైట్లలో లేకుండా తొలగించి కబ్జాదారులకు సహకరిస్తున్నారని తెలుస్తుంది. ఇప్పటికే మల్లాపూర్‌లోని చెరువును సగం వరకూ ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కుర్మల్‌గూడలోని పెద్దిరెడ్డి చెరువు నిండితే అలుగు పారే ఎఫ్‌టీఎల్ పరిధిని ఆక్రమించి ఏకంగా ప్రహరీ నిర్మించారు. వెంకటాపూర్‌లోని బురాన్‌ఖాన్ చెరువు కబ్జాలకు గురై ఇళ్లు మునిగిపోకుండా అక్రమంగా పెద్ద మోటర్లు పెట్టి చెరువు నీటిని బయటకు తోడేస్తున్నారు. గుర్రంగూడలోని గుర్రం చెరువు చుట్టూ ప్రహరీ నిర్మించారు.

జోరుగా దందా..

చెరువుల శిఖం భూముల కోసం అధికారులను మచ్చిక చేసుకుని స్థానిక నాయకుల అండదండలతో కబ్జాలకు పాల్పడుతూ జోరుగా దందా సాగిస్తున్నారు. భారీ వరదలు వచ్చినప్పుడు అప్పటికే చెరువులు, కుంటలు కబ్జాలు గురవ్వడంతో వరద నీరు అక్కడి నివాసాలను, కాలనీలను ముంచెస్తున్నాయి. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్న ఇళ్లకు, నాలాల మీద నిర్మిస్తున్న వాటికి ఇరిగేషన్‌నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని నిబంధన ఉన్నప్పటికీ డబ్బులకు కక్కుర్తి పడి క్షేత్ర పర్యటన చేయకుండానే అధికారులు ఎన్‌వోసీ ఇచ్చేయడం గమనార్హం.

హైడ్రా చర్యలు తీసుకోవాలి



చెరువుల అభివృద్ధి పేరిట ఆక్రమించి బహిరంగంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువులు అన్యాక్రాంతం చేస్తున్నారని పలు మార్లు మండల అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా కబ్జాలు చేస్తున్న వారితోపాటు చెరువుల్లో వెలసిన కట్టడాలపై చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాను.

– శూరకర్ణారెడ్డి, అల్మాస్‌గూడ

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యలు వివరిస్తున్న నర్సింగ్

పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలోని 18వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు గుండు నర్సింగ్ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కోరారు. బుధవారం ఆమెను కలిసి సమస్యలను విన్నవించారు. శ్రీరాం కాలనీలో స్మశాన వాటిక లేకపోవడంతో ఆఖరి మజిలీకి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. విద్యుత్ స్తంభాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో రాత్రి పూట అంధాకారం నెలకొంటుందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా మున్సిపాలిటీ అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 31వ డివిజన్‌లోని బాలాజీనగర్ కాలనీలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. అన్ని డివిజన్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గణేష్ నవరాత్రులు పురస్కరించుకుని రోడ్లపై ప్యాచ్ వర్కులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ బిక్కునాయక్, కొండా శ్రవణ్‌కుమార్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

మేయర్ పారిజాతరెడ్డి అధ్యక్షతన కార్పొరేషన్ హాల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి అంశాలను సభలో ప్రవేశపెట్టారు. సుమారు రూ.47.63 కోట్లతో, 15వ ఫైనాన్స్ నిధులు రూ.3.80 లక్షలు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ జి.రఘుకుమార్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగించుకోవాలి

కార్పొరేటర్ భిక్షపతిచారి



శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతున్న కార్పొరేటర్ భిక్షపతిచారి

మీర్‌పేట: అర్హులందరూ కేంద్ర పథకాలను సద్వినియోగించుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీర్‌పేట టీకేఆర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ట్రైనింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భిక్షపతిచారి మాట్లాడుతూ ఈ పథకంద్వారా చేతివృత్తులు చేసుకునే 18 కులాలకు వర్తిస్తుందని, ఆర్థికంగా వెనుకబడి పెట్టుబడి పెట్టలేని వారి కోసమే దీన్ని ప్రవేశపెట్టారన్నారు. శిక్షణ పూర్తయ్యాక నేరుగా బ్యాంకు మేనేజర్‌ను కలవాలని, స్పందించని యెడల వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం ఆయన శిక్షణకు వచ్చిన వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు ఉదయ్‌సాగర్, శ్రీనివాస్‌చారి, జంగాచారి, వెంకటేష్‌చారి, నరేష్‌చారి, ప్రవీణ్‌చారి, పాండురంగాచారి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దు

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్



కందుకూరు చౌరస్తాలో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కందుకూరు: మధ్యాహ్న భోజనం అమలును స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ పేర్కొన్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముట్టడికి మధ్యాహ్న భోజన కార్మికులు తరలివెళ్లారు. అంతకుముందు కందుకూరు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పైలెట్ ప్రాజెక్టుగా స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడం తగదన్నారు. 22 ఏళ్లుగా ఎన్నో కష్టాలు ఓర్చి విద్యార్థులకు వంట చేసి పెడుతున్న కార్మికుల పొట్ట కొట్టొదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యలు పరిష్కరిస్తారని ఆశతో ఉన్న తమ ఆశలు అడియాశలు చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, అశ్విని, అండాలు, లక్ష్మమ్మ, మహ్మద్, స్వప్న, సుగుణమ్మ, యాదమ్మ, లక్ష్మీదేవి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: శిథిల ఆలయాల మరమ్మతులతో పాటు నూతన దేవాలయాల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిశారు. పోచమ్మ ఆలయానికి ప్రహరి నిర్మించాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ అజీం, మైనార్టీ మండల అధ్యక్షుడు ఆరీఫ్, గ్రామ అధ్యక్షుడు తుమ్మ నర్సింహ్మా, పురుషోత్తం, శ్రీను పాల్గొన్నారు.

మాడ్గుల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి నల్లవారిపల్లి గ్రామానికి చెందిన నాయకులు విజయారెడ్డి, పెద్దయ్య, మల్లయ్య, సంపత్‌కుమార్‌లు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పలు సమస్యలు పేర్కొంటూ వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. గ్రామానికి యథావిధిగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. రుణమాఫీ విషయంలో అన్నదాతలు ఆందోళన చెందొదన్నారు.



ప్రొసిడింగ్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వైభవంగా సూర్యగిరి ఎల్లమ్మ కల్యాణం



అమ్మవారి ఘటం ఊరేగిస్తున్న మీగడ కాశీనాథ్



శివసత్తుల విన్యాసాలు



పోతరాజుల నృత్యాలు

భక్తులతో కిటకిటలాడిన రావిర్యాల

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో అమ్మవారి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నాలుగు గంటల నుంచే బారులు తీరారు. అమ్మవారికి నేవైద్యంగా బోనం సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణం సందర్భంగా సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారి దర్శించుకున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. రావిర్యాలలోని భోద పాండు రంగారెడ్డి ఇంట్లో ప్రత్యేకంగా అలంకరణ చేసిన అమ్మవారి ఘటాన్ని మీగడ కాశీనాథ్ శిరస్సుపై ఉంచి, శివసత్తుల పూనకాలు, వివిధ కళాకారులు విన్యాసాలతో ఊరేగించి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రావిర్యాల నుంచి ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో ఆలయ పౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఘటం నిర్వాహకులు బోధ పాండురంగారెడ్డి, మీగడ కాశీనాథ్, మురళీ, దేవాదాయశాఖ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు

రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటం విజయవంతం చేసినందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాండు రంగారెడ్డి ఆయా పార్టీల నాయకులకు, భక్తులకు, ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉత్సవాలు ప్రశాతంగా నిర్వహించడానికి సహకరించిన పోలీసులు, వివిధ శాఖల అధికారులకు అభినందించారు.

చెరువుల పరిరక్షణ బాధ్యత అధికారులదే

ఇబ్రహీంపట్నం: చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారుల దేనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్నం ప్రజాభవన్‌లో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తే సహించేది లేదన్నారు. సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టాలని పేర్కొన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీకి రూ.వంద కోట్ల నిధులు మంజూరు చేయించానని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గంలో అవసరమైన కొత్త రోడ్ల ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీ రద్దు చేయించామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. సిటీ నిర్మాణంతో నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందన్నారు.

ఎన్నాళ్లీ కంకరరోడ్డు కష్టాలు

- ఏడాదిగా ముందుకు సాగని నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న గిరిజనులు

మంచాల: తండాకు రోడ్డు సౌకర్యం కల్పించండి మహాప్రభో అని గిరిజనులు సుదీర్ఘకాలం పాటు వేడుకున్నారు. ఫలితంగా అధికార యంత్రాంగం కదిలింది. కావాల్సిన నిధులు మంజూరు చేసింది. ఏడాది క్రితం పనులకు ప్రారంభించింది. కంకర పోసి వదిలేసింది. కానీ.. ఏడాది గడిచినా ఎక్కడి గొంగళి అక్కడేనన్న చందంగా రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు.

పట్టించుకోని పాలకులు

మండల పరిధి ముచ్చర్లకుంట తండా.. ఒక్కప్పుడు ఆరుట్ల అనుబంధ గ్రామం. నేడు పటేల్ చెరువు తండా అనుబంధ గ్రామంగా మారింది. ఆరుట్ల నుంచి పటేల్ చెరువుతండా వరకు రోడ్డు సౌకర్యం ఉంది. పటేల్ చెరువుతండా నుంచి ముచ్చర్లకుంట తండాకు రోడ్డు లేదు. నాడు గుట్టల మధ్యన పూడి గుడిసెలతో విసిరేసినట్లుగా ఉన్న తండాకు.. దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా గుడిసెలు కాస్త.. ఇందిరమ్మ ఇళ్లుగా మారాయి. తాగునీటి సౌకర్యం కల్పించారు. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు గిరిజన తండాను పట్టించుకోలేదని, నేటికీ రహదారి సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పనులు ప్రారంభం చేసి

గిరిజనుల విన్నపాలతో గతేడాది అక్టోబర్‌లో (ఎస్టీ–ఎస్‌డీఎఫ్) ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.2 కోట్ల 90 లక్షలతో 4 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. పనులు ప్రారంభించారు. కంకరపోసి వదిలేశారు. ఏడాది కావస్తున్నా.. పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రోడ్డు కల నెరవేరుతుందని భావించిన గిరిజనులకు నిరాశే మిగిలింది. కంకర రోడ్డులో ప్రయాణించలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయంపై సంబంధిత ఏఈఈ హరి నాయక్‌ను వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించడానికి ఎస్టిమేషన్ పంపామని, వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.



ముచ్చర్లకుంట తండా రోడ్డు దుస్థితి

ఇబ్బందిగా ఉంది



రహదారి నిర్మాణ పనులు ఆగిపోయి ఇబ్బందిగా మారింది. ద్విచక్ర వాహనాల్లో కాదు కదా.. కనీసం కాలి నడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. ప్రమాదాలు జరిగి పలువురు ఆస్పత్రి పాలయ్యారు. ఎన్నాళ్లు మాకు రోడ్డు కష్టాలు. దారి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి.

– ఉదావత్ మత్రు నాయక్, ముచ్చర్లకుంట తండా

విన్నవిస్తూనే ఉన్నాం



పటేల్ చెరువుతండా నుంచి ముచ్చర్లకుంటతండాకు రోడ్డు నిర్మాణ పనుల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక సార్లు విన్నవించాం. త్వరగా పూరి చేయాలని విన్నవిస్తూనే ఉన్నాం. అయినా ఎవరూ స్పందించడం లేదు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు పూర్తి చేయాలి.

– మేగావత్ రాజు నాయక్, మాజీ సర్పంచ్, పటేల్‌చెరువు తండా